
## అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు



సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు

ఆమనగల్లు, జనవరి 11 : పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీవో ప్రభాకర్ హెచ్చరించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన రూ.1,75,28,756 ఖర్చుతో వివిధ రకాల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పనుల్లో జరిగిన అవకతవకలను వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియా నాయక్. అంబుడ్స్‌మన్ సునీత, ఏవీవో కొండయ్య, ఎంపీడీవో ఫారుక్ హుస్సేన్, ఎస్‌ఆర్‌పీ వెంకన్న, ఏపీవో మాధవ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# స్వాహాపై రచ్చ

**ఐకేపీ కమీషన్ స్వాహాపై జడ్పీ మీటింగ్‌లో వాడివేడిగా చర్చ**

- అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్న జడ్పీ వైస్ చైర్మన్
- బాధ్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు తాండూరు ఎమ్మెల్యే ఆదేశం
- డీపీఎంను సస్పెండ్ చేస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి
- 'మన ఊరు-మన బడి' పనుల పెండింగ్ బిల్లులు విడుదలకు వినతులు..
- సీఎంఆర్ రైస్ పక్కదారి పడుతున్నదని సభ్యుల ఫిర్యాదు
- కర్ణాటక సరిహద్దులోని 1500 ఎకరాల జిల్లా భూముల ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి
- 15 రోజుల్లోగా పనుల ఎంబీ రికార్డులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సునీతారెడ్డి, చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 11, (నమస్తే తెలంగాణ): ఐకేపీ డబ్బులు స్వాహా పేరిట గురువారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనంపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. గురువారం మద్దుల్‌చిట్టంపల్లిలోని డీపీఆర్సీ భవనంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్ ఐకేపీ డబ్బులు స్వాహాపై మాట్లాడుతూ అమాయకులైన ఐకేపీ సభ్యులకు అందాల్సిన కమీషన్ డబ్బులను నొక్కేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాలకు రుణాలను మంజూరు చేయడంలోనూ అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అవినీతికి పాల్పడిన డీపీఎంను సస్పెండ్ చేస్తామని, సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. అదే విధంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఐకేపీ కమీషన్ డబ్బుల్లో అవినీతికి పాల్పడిన బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని ప్రజాప్రతినిధులు నిలదీయగా డీపీఎం స్థాయి అధికారి ఈ విధంగా అవినీతికి పాల్పడడంపై తాను సిగ్గుపడుతున్నానంటూ సమాధానమిచ్చారు.

### పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి...

మన ఊరు-మన బడిలో భాగంగా స్కూళ్లలో మౌలిక సదుపాయాలను కల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.10కోట్లను వెంటనే ప్రభుత్వం విడుదల చేసేలా చొరవ తీసుకోవాలని సభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. స్కూల్ కమిటీ చైర్మన్లు ముందుకు వచ్చి పనులు చేశారని, బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సభా దృష్టికి తీసుకువచ్చారు. అంతే కాకుండా సీఎంఆర్ రైస్ అవకతవకలకు అడ్డుకట్ట వేయడంపై దృష్టి పెట్టాలని, సీఎంఆర్ రైస్‌ను నిర్ణీత సమయంలోగా తిరిగివ్వకుండా పక్కదారి పట్టిస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. రైస్ మిల్లర్లు తిరిగివ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్నారని దౌల్తాబాద్ జడ్పీటీసీ మహిపాల్ ఆరోపించారు, దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ధాన్యానికి తగిన విధంగా సీఎంఆర్ రైస్ తిరిగి ఇస్తున్నారని, సీఎంఆర్ రైస్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై దృష్టి సారించామన్నారు. మరోవైపు కర్ణాటక సరిహద్దులోని మన జిల్లాకు సంబంధించిన 1500 ఎకరాల భూములను ఆ రాష్ట్ర రైతులు ఆక్రమించి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. దీనిపై గతంలోనూ ఫిర్యాదు చేశామని, బషీరాబాద్ మండలంలోని 5-6 గ్రామాల పరిధిలో, కొడంగల్ పరిధిలో ఆక్రమణలున్నాయని బషీరాబాద్ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, త్వరలోనే జాయింట్ సర్వే నిర్వహించి ఆక్రమణదారుల నుంచి జిల్లా భూములను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మర్పల్లి మండలం తుమ్మలపల్లిలో 500 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేట్ వెంచర్ నిర్వాహకులు 100 ఎకరాల వరకు ఎఫ్‌టీఎల్ భూములను కబ్జాకు పాల్పడడంతోపాటు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలను చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మర్పల్లి జడ్పీటీసీ సమావేశం దృష్టికి తీసుకురాగా, త్వరలో పరిశీలిస్తామని డీపీవో తరుణ్‌కుమార్ సభాముఖంగా వెల్లడించారు.

### ఎంబీ రికార్డు చేయమంటే ఏ పార్టీ అని అడిగిండ్రు..

మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పూర్తైన పనులకు సంబంధించి ఎంబీ రికార్డు చేయాలని కోరుతుంటే.. ''మీది ఏ పార్టీ'' అని తాండూరు పంచాయతీరాజ్ ఏఈ అడుగుతున్నారని దౌల్తాబాద్ జడ్పీటీసీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ పంచాయతీరాజ్ ఏఈలపై ఈమధ్య చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రొటోకాల్ పాటించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులను గౌరవించాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా 15 రోజుల్లోగా పూర్తైన పనులకు సంబంధించి ఎంబీ రికార్డులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణి, ఆయా శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్కూళ్లలో వసతులకు నిధులు : అసెంబ్లీ స్పీకర్

ప్రభుత్వ స్కూళ్లను బాగు చేసేందుకు ఎన్ని నిధులైనా మంజూరు చేసేలా చర్యలు చేపడుతామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో ఎక్కడైతే సమస్యలున్నాయో అంచనాలను పూర్తి చేస్తే నిధులు తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలోకి నడిపించేందుకు తనవంతు కృషి చేస్తాన్నారు. మరోవైపు అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని, అవినీతికి, అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి :జడ్పీ చైర్‌పర్సన్

వచ్చే యాసంగిలో ఆరుతడి పంటలను రైతులు సాగు చేసేలా రైతులకు సలహాలు, సూచనలు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సూచించారు. జొన్న, నూనెగింజల సాగు రానురాను తగ్గిపోతుందని, నూనెగింజల సాగు పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. తేనెటీగల పెంపకంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఆర్గానిక్ పంటలకు మంచి డిమాండ్ ఉన్న దృష్ట్యా ఆర్గానిక్ పంటలను సాగు చేసేలా రైతులకు ప్రోత్సహించాలన్నారు. వానకాలంలో వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని జడ్పీ చైర్‌పర్సన్ ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి జిల్లాకు సాగు, తాగునీరందించాలన్నారు. పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను రాబట్టే విధంగా ప్రత్యేక కార్యాచరణతో పిల్లలను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ కేంద్రాల వద్ద ప్రజలు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మరిన్ని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

### డీపీఎంపై సస్పెన్షన్ వేటు

బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ ఐకేపీ సభ్యులకు అందాల్సిన పదిలక్షల కమీషన్ డబ్బులను స్వాహాచేసిన డీపీఎం వీరయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డీపీఎంతో పాటు బురాన్‌పూర్ వీవోఏ నర్సింహులును విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



జడ్పీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

## బడి బయట పిల్లలు.. 515 మంది

**లెక్కతేల్చిన విద్యాశాఖ**

**గత డిసెంబర్ 11 నుంచి జనవరి 10 వరకు జిల్లా వ్యాప్తంగా కొనసాగిన సర్వే**

**వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారుల చర్యలు**

రంగారెడ్డి, జనవరి 11(నమస్తే తెలంగాణ): బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చేపట్టిన బడి బయట పిల్లల గుర్తింపు సర్వే జిల్లాలో ముగిసింది. గత డిసెంబర్ 11 నుంచి ఈ ఏడాది జనవరి 10 వరకు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించారు. ఈ మేరకు 515 మంది బాలబాలికలు బడికి దూరంగా ఉన్నట్లు అధికారులు లెక్కతేల్చారు. వీరిని వచ్చే విద్యాసంవత్సరం సమీపంలోని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికోసం వర్క్‌సైట్ పాఠశాలల ఏర్పాటుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టనున్నది.

### మూడు కేటగిరీల్లో పిల్లల గుర్తింపు..

వివిధ కారణాలతో చాలా మంది పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. కొందరు బడి ముఖం అసలే ఎరుగక పోగా.. మరికొందరు మధ్యలో చదువును మానేస్తున్నారు. వివిధ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వీరంతా తిరిగి బడి బాట పట్టేలా విద్యాశాఖ ప్రతి సంవత్సరం బడి బయట పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహిస్తున్నది. ఈ ఏడాది కూడా సీఆర్పీలు జిల్లా వ్యాప్తంగా ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించారు. పరిశ్రమలు, పని ప్రదేశాలు, దుకాణాల వద్ద సర్వే చేపట్టి బడికి దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించారు. 6 నుంచి 14 సంవత్సరాల లోపు 274 మంది బడీడు పిల్లలు, 15 నుంచి 19 సంవత్సరాల లోపు 84 మందిని కళాశాల స్థాయిలో పిల్లలను వేర్వేరుగా గుర్తించారు. ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చిన కుటుంబాలకు చెందిన 157 మంది పిల్లలను సైతం గుర్తించి జాబితాలను వేర్వేరుగా రూపొందించారు. గుర్తించిన పిల్లలను వచ్చే విద్యాసంవత్సరం సమీప పాఠశాలల్లో చేర్పించనున్నారు. కళాశాల స్థాయి విద్యార్థులకు విద్య వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసి ఓపెన్ ఎడ్యుకేషన్ విధానం ద్వారా చదువుకునే విధంగా ప్రోత్సహించనున్నారు. సర్వే వివరాలను జాతీయ స్థాయిలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

### పని వద్దే పాఠశాలల ఏర్పాటు..

ప్రతి సంవత్సరం ఇటుక బట్టీల నిర్వహణకు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు చాలామంది కార్మికులు వస్తుంటారు. అలాగే విగ్రహాల తయారీ పరిశ్రమలు, క్వారీల్లో ఇతర రాష్ట్రాల వారే ఎక్కువగా ఉంటున్నారు. ఈ తరహా కార్మికులకు సంబంధించిన పిల్లల చదువు కోసం పని ప్రదేశంలోనే పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకోనున్నది. పిల్లల మాతృభాష తెలిసిన ఒక వలంటీర్‌ను నియమించి విద్యాబోధన జరుపుతారు. సంబంధిత వలంటీర్‌కు ఆయా యజమానులే వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. వర్క్‌సైట్ పాఠశాలల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## ఓటరు జాబితా పకడ్బందీగా ఉండాలి

**పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తం కావాలి**

**ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి**

**సమీక్షా సమావేశంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

ఇబ్రహీంపట్నం, జనవరి 11 : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున ఆర్డీవోలు ఓటరుకు సంబంధించి వచ్చిన ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలతో పార్లమెంట్ ఎన్నికలు, ధరణి సమస్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలని సూచించారు. పేర్లు తొలగించిన వాటి విషయంలో సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టాలని, డూప్లికేషన్లు లేకుండా చూడాలన్నారు. ఫామ్-8 ద్వారా మార్పులు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇంకా ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ముఖ్యంగా 1450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాలని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తూ అందుకు గల కారణాలను విశ్లేషించాలని సూచించారు. ప్రజావాణిలో ధరణికి సంబంధించిన దరఖాస్తులు అధిక మొత్తంలో పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం వహించవద్దన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక




### పండుగకు పయనం..

ప్రభుత్వం విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులివ్వడంతో గురుకులాలు, పలు వసతి గృహాల్లో ఉండి చదువుంటున్న విద్యార్థులు ఇంటి బాట పట్టారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని పలు బస్టాండ్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రద్దీగా దర్శనమిచ్చాయి.

## గంజాయి పట్టివేత

- హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసుల అదుపులో 8 మంది
- 7.50 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

పెద్దఅంబర్‌పేట్, జనవరి 11 : గంజాయి, డ్రగ్స్ నివారణకు హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా డిప్యూటీ కమిషర్ రవికాంత్ పర్యవేక్షణలో సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు, హనుమంత్‌రావు నేతృత్వంలో గురువారం ఉదయం 3 గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం సమీపంలోని రామోజీ ఫిలింసిటీ దగ్గరలో ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే అన్ని ప్రైవేట్, ఆర్టీసీ ఇతర వాహనాల రాకపోకలపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి 8 మంది ప్రయాణికుల నుంచి సుమారు కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.7లక్షల వరకు ఉంటుందని వివరించారు. ఆంధ్రాలోని విశాఖజిల్లా పలాస, రాజమండ్రి, నర్సీపట్నం, అరకు, ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు గంజాయిని రవాణా చేస్తున్నట్లు పట్టుబడిన యువకులు తమ విచారణలో వెల్లడించారు. వీరు ఈ పని చేయడం వల్ల పదివేల రూపాయల వరకు కమీషన్ లభిస్తుందని, హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. యువత ఇలాంటి అక్రమ కేసుల్లో చిక్కుకొని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. దీన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ నిరంతరం చర్యలు చేపట్టిందని, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో సరూర్‌నగర్ డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు వెంకన్న, హనుమంతు, సరళ, పాషా ఉన్నారు.



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి